కథ

# వృద్ధాప్యంలో బాల్యం

ప్రతాప వెంకట సుబ్బారాయుడు



"మీ స్నేహితుడు వామనరావు పరిస్థితి ఏమీ బాగోలేదు.. అన్నయ్యగారూ దయచేసి ఒకసారి రాగలరు" నా స్నేహితుడి భార్య గొంతు ఫోనులో వినడంతోటే నా గుండెల్లో గాభరా మొదలైంది.

కొండరాయిలా నిక్షేపంలా ఉండేవాడు. నాలుగు నెలల క్రితమే రిటైర్ అయ్యాడు. వాడికేమయ్యుంటుంది? మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది.

నేను మా ఆవిడతో విషయం క్లుప్తంగా చెప్పి.. మాకు మూడు కిలోమీటర్ల దూరంలో వుండే వాళ్లింటికి స్కూటర్ మీద బయల్దేరాను.

నేను వాళ్లింటికి వెళ్లేసరికి వాళ్లింటి ముందు ఆ వీధిలోని నలుగురైదుగురు, మావాడి భార్యా పిల్లాడు వున్నారు. నన్ను చూడంగానే "ఆయన నిన్న సాయంత్రం నుండి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. మొదట్లో పైత్యం ఏమన్నా చేసిందేమో.. రేప్పొద్దునకల్లా

సర్దుకుంటుందనుకున్నాను. కాని ఇవాళ లేచినప్పటి నుండి అలాగే వున్నాడు. అందుకే నీకు ఫోన్ చేశానన్నయ్యా. పిల్లలేమో విదేశాల్లో సెటిలయ్యారు.. ఈ సమయంలో నాకేం చేయాలో పాలుపోవడం లేదు" అంది కళ్లొత్తుకుంటూ.. నేను చూస్తానన్నట్టుగా చేతుల్తో వారించి .. లోపలికెళ్లాను.

"నన్ను చూడంగానే మావాడు "ఏరా వచ్చావా?" అన్నాడు ఆనందంగా..

నన్ను గుర్తు పట్టాడంటే వాడు బాగున్నట్టే.. మరేమిటి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడంటారు? నాకు వాళ్ళ మానసిక స్థితి మీద డౌటు వచ్చింది.

వాడు గబగబా షెల్ఫ్ దగ్గరకెళ్ళి అక్కడున్న పేపర్ల కట్టలోంచి రెండు పేపర్లు బర్రున చింపి "రారా.. కాగితపు పడవలు చేసుకుందాం" అన్నాడు.

నాకు పిచ్చెక్కింది. "అదేంట్రా" అన్నాను.

"ఏం నువ్వెప్పుడూ చేయలేదా అయితే రా నేను నేర్పుతాను.." అని పావుగంటలో కత్తిపడవ, గూటిపడవ, స్టీమరూ చేసి "దగ్గరికి రా నేర్పిస్తాను" అన్నాడు.

నేను ముందుగా వాడి లెవెల్‌కి వెళ్ళి వాడిని మన దారికి తీసుకువద్దామని.. వాడి పక్కన చతికిలపడ్డాను. నాకు తెలుసు ఇప్పుడు నా మానసిక పరిస్థితిని కూడా అనుమానిస్తారని. కాని తప్పదు.. వాడిని ఈ లోకంలో పడెయ్యాలంటే నాకు తప్పదు.

"నీకు విమానం చేయడం వచ్చా?"

"రాదు..."

"అయితే చూడు.. అని" కాగితం ముక్కలు తీసుకుని ముందుగా శ్రద్ధగా రెక్కలు చేయడం మొదలెట్టాడు. అంతలోనే తన మూడ్ మారిపోయినట్టుంది" అవున్రా .. నీకు పడవలు నీళ్లలో తిరుగుతుంటే చూడాలనుంది కదా.." అని వంటింటిలోకి పరిగెత్తుకెళ్ళి నీళ్ల బకెట్ తీసుకొచ్చాడు. అందులో పడవలు వేసి చేతుల్తో నీళ్లు తిప్పి పడవలు తిరుగుతుంటే చప్పట్లు కొడుతూ తన హర్షాతిరేకం వ్యక్తం చేశాడు. నన్ను కూడా చప్పట్లు కొట్టమన్నట్టుగా సంజ్ఞ చేశాడు నేను చేసేదేం లేక చప్పట్లు కొట్టాను.

అంతలో పైన విమానం వెళుతున్నట్టుగా శబ్దం వినిపించింది. అంతే బయటికి పరిగెత్తుకెళ్ళి విమానం వంక చూస్తూ చేతులూపసాగాడు. అంతే కాకుండా డాబామీదకెళ్ళి విమానం కనుమరుగయ్యేంత వరకూ చూస్తూ చేతులూపుతూనే వున్నాడు.

నాకు వాడి పరిస్థితి విచిత్రంగా అనిపిస్తోంది. ఏంటి వీడిలా ఐదారేళ్ళ పిల్లాడిలా ప్రవర్తిస్తున్నాడు? వీడికేమైందసలు? ఎంత గంభీరంగా హుందాగా వుండేవాడు. ఆఫీసులో స్ట్రిక్ట్ ఆఫీసరుగా మంచి పేరు వుండేది. అప్పటి స్టాఫ్ ఇప్పుడీ పరిస్థితి చూస్తే వాళ్ళకి పిచ్చెక్కడం ఖాయం.

నన్ను చెయ్యట్టుకుని మళ్ళీ కిందకి తీసుకెళ్ళాడు. వాళ్ళావిడ వంక చూసి "ఆకలేస్తోంది" అని పొట్ట చూపించాడు.

వాళ్ళావిడ "ఆయన నిన్న రాత్రి నుండి అన్నం తినలేదు. పాపిష్టి దాన్ని ఈ హడావుడిలో పడి ఆయనకు అన్నం కూడా పెట్టలేదు" అని వంటింట్లోకెళ్ళి కంచంలో అన్నం కలుపుకుని తెచ్చింది. వాడు కంచం చేతుల్లోకి తీసుకోకుండా వాళ్ళావిడనే పెట్టమని మారాం చేస్తూ బయటకి పరిగెత్తాడు. అప్పటికే ఈ విషయం తెలుసుకుని విచిత్రం చూద్దామని చాలామందొచ్చారు. ఆవిడ ఏడుస్తూ వాడికి అన్నం పెడుతోంది.. ముద్ద ముద్దకీ తిననని మారాం చేస్తుంటే బొమ్మలతో ఆడిస్తూ.. బూచాడొస్తాడని భయపెడుతూ.. తినిపించసాగింది.

వాడు అన్నం తిని లాల పోసుకుంటానని బాత్రూంలోకి పరిగెట్టాడు. మాకు పై ప్రాణాలు పైనే పోయాయి. ఎలాంటి దృశ్యం చూడాల్సొస్తుందోనని. కాని వాడు తలుపేసుకుని చక్కగా స్నానం చేసి బట్టలు కట్టుకుని బయటకొచ్చాడు. దేవుడికి దణ్ణం పెట్టుకుని, పౌడర్ రాసుకుని ఫ్రెష్‌గా వచ్చి మళ్ళీ నాతో 'ఆడుకుందామా' అన్నాడు.

నేను వాడితో కాసేపు ఆడుకున్నట్టుగా నటించి బయట హాల్లో కొచ్చి వాళ్ళావిడతో అక్కడున్న మిగతావాళ్ళతో "లాభం లేదమ్మా.. వాడికి మతి చలించింది. ఇలా చెప్పడం చాలా బాధగా వున్నా తప్పడం లేదు. మరి నువ్వనుమతిస్తే పిచ్చాసుపత్రికి ఫోన్ చేసి అంబులెన్స్ తెప్పిస్తా.." అన్నాను బాధగా.

ఆవిడ 'ఊ' అన్నట్టుగా తలూపింది. అంతలో వాడు మా దగ్గరకొచ్చి "మీరందరూ అనుకుంటున్నట్టు నాకేం పిచ్చెక్కలేదు. అందరి జీవితంలో బంగారం లాంటిది బాల్యం. మా అమ్మ చిన్నప్పుడే చనిపోవడంతో మా నాన్న మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆ వచ్చినావిడ నన్ను నానా బాధలు పెట్టింది. దాంతో నాకు తెలియకుండానే కౌమారంలోకి అడుగుపెట్టాను. నా జీవితంలో ఏ లోటు లేదు. ఒక్క బాల్యాన్ని అనుభవించలేదని తప్ప. మనిషిగా ఈ జీవితం ఒక్కసారే.. అందులో బాల్యమూ ఒక్కసారే.. అందుకే ఆ అనుభూతి కోసం ఇంత తాపత్రయపడ్డాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. క్షమించండి." అన్నాడు.

వాడికేమీ కానందుకు ఆనందిస్తూ అందరితో పాటు నేను ఇంటిదారిపట్టాను. ■




**కోల్‌కతా ప్రెస్‌క్లబ్ సందర్శించిన వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి దుర్గారావు, కార్యవర్గ సభ్యులు నాగరాజు పట్నాయక్, ఎల్.జి. నాయుడు, ఎం.ఎస్.ఆర్. ప్రసాద్, డేవిడ్, నాని, మాధవరావు, దాడి రవి, ఈశ్వరరావు, గిరిబాబు తదితరులను అభినందిస్తున్న బెంగాల్ హీరో, ఎమ్మెల్యే చిరంజిత్.**